విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వెంకటేశ్వర్లుపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ నారాయణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆర్టీసీ డ్రైవర్ కే వెంకటేశ్వర్లు విధుల్లో ఉండగా ప్రయాణిస్తున్న బస్సు వర్షం కారణంగా పైన ద్యామేజీలతో బస్సు కారడం వలన అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు వీడియో తీసి మీడియాకు ఇవ్వగా అది వెంకటేశ్వర్లు తీయించాడని కాకినాడ డిపో జనరల్ మేనేజర్ ఎంవి మనోహర్ డ్రైవర్ కె వెంకటేశ్వర్లు అక్రమ సస్పెండ్ చేశారని ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా ప్రభుత్వ డ్రైవర్ హెల్పర్ అసోసియేషన్ కాకినాడ డిపో వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ నారాయణ మాట్లాడుతూ నిజ నిజాలు తెలుసుకోకుండా డ్రైవర్లకు, క్లీనర్లకి రక్షణ ఇవ్వాల్సిన డిపో మేనేజర్ ఇలా సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. తప్పు జరిగినప్పుడు యాక్ట్ ప్రకారం ఎంక్వైరీ వేసి రుజువైన తర్వాత చర్యలు తీసుకోవాలని వ్యక్తిగతంగా కక్ష సాధింపుతో అయినా పెద్ద నేరం చేసిన వాడిలా వెంకటేశ్వర్లుని సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. వెంటనే వెంకటేశ్వర్లుని విధుల్లోకి తీసుకోకపోతే మిగతా సంఘాలను కలుపుకొని మరింత ఉద్యమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాష్ట్ర చైర్మన్ శేష కుమార్, స్టేట్ కమిటీ ప్రెసిడెంట్ మూర్తి, డిపో ప్రెసిడెంట్ కె గోవింద్, పిఎల్ రాజు, డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ముప్పిడి పూజలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లిలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని శనివారం ఉదయం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం అనంతరం ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామిని అమ్మవార్లను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం మండపం లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు స్వామివారి చిత్రపటం అందజేసి సత్కరించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆయన వెంట తెలుగుదేశం నేతలు కే రవికుమార్, ముప్పిడి అశోక్ కుమార్, పి దేవ కరుటూరి బాలాజీ, జనసేన నేతలు సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, స్థానిక భక్తులు తంగెళ్ల శివశంకర్, ఆర్ వెంకటరత్న, ఉప్పల పార్టీ సుబ్బారావు ఉన్నారు.

కొవ్వూరులో అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు బస్‌స్టాండ్ సెంటర్‌లో మూతపడిన అన్నా క్యాంటీన్ పరిశీలించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, ఈ సందర్భంగా టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 9 నుండి ఉదయం 11 గంటలకు అన్నా క్యాంటీన్ పునఃప్రారంభించ బడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్న గూడెం గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా బ్యాంక్ ఆఫ్ బరోడా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గుడివాడ సురేంద్ర కుమార్ నాయుడు విద్యావేత్త కొయ్యలమూడి నాగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆధునిక దేవాలయాలు అయిన గ్రంథాలయాలను విద్యార్థి దశనుండే దినచర్య లోభాగం చేసుకోవాలన్నారు. నాగేశ్వరరావు మాట్లా డుతూ గ్రంథాలయం అంటే విజ్ఞాన భాండాగారమని ప్రతి ఒక్కరూ గ్రంథాలయం ద్వారా జ్ఞాన సముపార్జన పొందాలని గ్రంథాలయ సేవలను మరింత విస్తృత పరచడానికి కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వారు బహుమతులను అందిం చారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ధూళిపూడి రవీంద్ర ఎంపిటిసి బొంతా చినబాబు పార్డ్ ఇండియా సంస్థ సభ్యులు సోమశెట్టి వెంకటరావు బళ్ల రామచంద్రరావు హేమ కుమార్ లైబ్రేరియన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఓటమికి రోడ్లు ప్రధాన కారణం

విశాలాంధ్ర - అనపర్తి : గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ మరీ దుర్భరంగా తయారైన పరిస్థితని జగన్మోహన్‌రెడ్డి ఘోరంగా ఓడిపోవడానికి ప్రధాన కారణాల్లో రోడ్లు కూడా ఒకటిగా భావిస్తు న్నానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నియోజక వర్గ ఆర్అండ్‌బి డిపార్ట్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, నాలుగు మండలాల ఇంజనీర్లతో సమావేశమై రోడ్ల పరిస్థితిపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చర్చించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ - రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు పునర్నిర్మాణం అత్యవసరమని అనేక ప్రమాదాలకు ప్రయాణికులు గురవుతున్న కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. సింగంపల్లి-రంగంపేట రోడ్డు, గొల్లల మామిడాడ పరిధిలో కొంతమేర మిగిలిన రోడ్డు పూర్తి చేయడం జరుగుతుం దని ఎమ్మెల్యే నల్లమిల్లి చెప్పారు. ఎంపీ పురంధీశ్వరితో కలిసి కెనాల్ రోడ్డు సమస్య శాశ్వతపరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి వివరించారు.

మోకాళ్ళపై ఎక్కి మొక్కు చెల్లించుకున్న జన సైనికుడు

విశాలాంధ్ర - సీతానగరం : జనసేన గెలుపుతో మోకాళ్ళపై ఎక్కి మొక్కు చెల్లింపు. మండలంలో రాపాక గ్రామ వాత్వ్యాయుడు ముత్యాల మహేష్ శనివారం గోకవరం మండలం తంటికొండ గ్రామంలో కొండ పై వెలసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుమారు 500 మెట్లను మొక్కళ్ల పై కొండ పైకి చేరుకొని తన మొక్కును చెల్లించుకున్నాడు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనసేన విజయం సాధించాలని అలాగే రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అఖండ మెజారిటీతో విజయం సాధించాలని మొక్కు కోవడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా మన్నారు. సువ్వల మోహన్, పిండి వివేక్, కృష్ణ వంశీ, పత్తి గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముప్పడిని కలిసిన జేఏసీ చైర్మన్ జడల

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావుని తూర్పుగోదావరి జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ జోడాల వెంకట్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో అందరూ కలిసి ఉన్నత పనితీరు కనబరుస్తూ ప్రభుత్వానికి సహకారం అందిస్తూ ముందుకు వెళ్లేలా కృషి చేస్తామన్నారు. నిరుద్యోగం తగ్గించేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు.

పూడికతీత పనుల పరిశీలన

డ్రైనేజీలపై వేసిన రాళ్లు తొలగించండి

లేదంటే మేమే తొలగిస్తాం

ఆ చార్జీలు వసూలు చేస్తాం

వ్యాపారస్తులకు కమిషనర్ ఆదేశం

విశాలాంధ్ర - కాకినాడ : డ్రైనేజీలలో పూడికతీత పనులకు అవరోధంగా ఉన్న స్లాబ్ రాళ్లను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే వెంకటరావు వ్యాపారులను ఆదేశించారు. స్లాబ్ రాళ్లను స్వచ్ఛందంగా తొలగించకపోతే వాటిని నగరపాలక సంస్థ తరపున తొలగించి అందుకు అయ్యే ఖర్చును వసూలు చేస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన కాకినాడ నగరంలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. గాంధీ నగర్, చీడీలపొర ప్రాంతాలలో టీఎంఎక్స్ మిషన్ ద్వారా జరుగుతున్న డి-సిల్టేషన్ పనులను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే రేచర్లపేట, దుమ్ములపేట, సినిమా రోడ్ ప్రాంతాలలో కార్మికుల ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. పలుచోట్ల పూడికతీత పనులకు డ్రైనేజీలపై ఉన్న స్లాబ్ రాళ్లు అవరోధంగా ఉన్న అంశాన్ని ఆయన గుర్తించారు. వెంటనే వాటిని తొలగిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో వ్యాపారస్తులు డ్రైనేజీలను ఆక్రమించి స్లాబ్ రాళ్లను ఏర్పాటు చేశారని, దీనివల్ల డి-సిల్టేషన్ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. సకాలంలో పూడికతీత పనులు పూర్తి కాకపోతే రానున్న రోజుల్లో వర్షాలు పడే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల వ్యాపారులు సహకరించి స్వచ్ఛందంగా డ్రైనేజీలపై వేసిన రాళ్ళను తొలగించాలని సూచించారు. వారం రోజుల్లో డి-సిల్టేషన్ పనులను పూర్తి చేయాలని ఆయన ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. వర్షాకాలంలో ఎక్కడా నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సముద్రాల పరిరక్షణకు

సమష్టి కృషి అవసరం

సాగరం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయి

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జె నరసింహ నాయక్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్, ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేడియో అల 90.8 ఎఫ్ఎం, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఎన్‌టిఆర్ బీచ్ పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జె నరసింహ నాయక్ బీచ్ పరిశుభ్రతా కార్యక్రమాన్నిలాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ సాగరం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయనే విషయాన్ని విస్మరించరాదని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో సముద్రాలను కలుషితం చేయడం వలన పర్యావరణ సమతుల్యతను సర్వనాశనం అవుతుందన్నారు. రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడి రామారావు మాట్లాడుతూ అవగాహనా రాహిత్యంతో సముద్రాలతో పాటు తీర ప్రాంతాలను కాలుష్య కారకాలుగా మార్చడంవలన విపత్తులను ఎదుర్కోవలసివస్తుందన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రీషన్ (హెన్) ప్రాజెక్ట్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిఎన్ మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణ పట్ల అవగాహనకు యువతలో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ డాక్టర్ కాద వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతిలో మనకు లభిస్తున్న ప్రాణవాయువు నూటికి డబ్బైశాతం సముద్రాలలో జీవించే ఆల్గేల వలన మనకు లభిస్తుందని తెలిపారు. సముద్ర జలాలలో వ్యర్థాలను విడుదల చెయ్యడం వలన సముద్రంలో జీవించే జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రముఖ సామాజిక వేత్త వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ సముద్రాలలో వ్యర్థాలు కలవకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ చాప్టర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణకు సమిష్ట కృషి అవసర మన్నారు. విశ్రాంత జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ డివివి సత్యనారాయణ (వీరు) మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎంవిఆర్ ఫణీంద్ర, రామచంద్రాపురం ప్రభుత్వ కళాశాల కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ శోభారాణి, కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఎం పాండురంగారావు, డాక్టర్ ఎం కృష్ణారావు, జి పావని, సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి క్యాడెట్‌లు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు తొలగించాలి

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండలం విశ్వేశ్వరపురం - గుడిమెల్లంక గ్రామాల సరిహద్దుల్లో ప్రధాన రహదారి పక్కన పేరుకు పోయిన చెత్త కుప్పలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ సౌకర్యం లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది చెత్తను రహదారి పక్కన పడేస్తున్నారు. వర్షాలకు ఆ చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దానికి తోడు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గేమ్ ఛేంజర్ చిత్రీకరణలో రామోజీ రావుకి నివాళి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసిన ఈనాడు సంస్థల అధినేత, దిగ్గజ పాత్రికేయులు రామోజీరావు మరణం అత్యంత బాధాకరం. శనివారం రాజమండ్రిలో గేమ్ ఛేంజర్ చిత్రీకరణ చేస్తున్న రామ్ చరణ్ రామోజీ రావుకి అశ్రు నివాళులు అర్పించారు. ఆయనతో పాటు దర్శకులు శంకర్, నటులు సునీల్ రఘు కారుమంచి ఇతర చిత్ర బృంద సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. రామోజీరావు మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు అని తెలిపారు.

వాడపల్లి క్షేత్రానికి ఆశేష భక్తజనం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల, ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోని శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి క్షేత్రం గోవింద నామాలతో మార్మోగింది. శనివారం కావడంతో ఏడువారాల మొక్కలు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేలాదిగా భక్తులు కాలినడకన తరలివచ్చారు. స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్య లక్ష్మీ హోమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి సుప్రభాత సేవ, మేలుకొలుపు సేవ, స్వామివారి పుష్పాలంకరణ అనంతరం స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో వెంకటేశ్వర స్వామి చరిత్ర గానంతో నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందు తలెత్తకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ బి కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఒక రోజే ప్రత్యేక దర్శనం ద్వారా రూ.24,38,604, అన్నదాన ప్రసాదం ద్వారా స్వామి సేవా రూ.2,92,610, లడ్డువిక్రయం ద్వారా రూ.6,22,470, ఆన్లైన్ ద్వారా రూ. 1,34,162, భక్తుల విరాళం ద్వారా రూ.10,876, సేవలు వల్ల ఆదాయం రూ. 38,000, మొత్తం రూ. 35,36,722లు మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన ఆదాయమని ఆలయ కార్యనిర్వహణాధికారి బి కిషోర్ కుమార్ తెలిపారు. ఆలయం వద్ద శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఆత్రేయపురం ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే వరుపులకు న్యాయవాదులు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఇటీవల ప్రత్తిపాడు నియోజవర్గ ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ భారీ మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో ప్రత్తిపాడు బార్ సోసియేషన్ సభ్యులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ కుక్కుటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొంగు ఊరి మధుబాబు మాట్లా డుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో అటు ప్రజలకు న్యాయవాదులకు నష్టం వాటి లేదా చట్టం చేసిందన్నారు. ఈ విషయమై న్యాయవాదులు అనేక విధాల చట్టాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేసామని ఆమెకు వివరించారు. సదరు చట్టాన్ని రద్దు పరచి రాష్ట్ర ప్రజలకు, న్యాయవాదులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్ వెంకట్రావు, స్పోర్ట్స్ కార్యదర్శి గౌరీ శంకర్, మాజీ అధ్యక్షులు చెల్లంకూరి రామకృష్ణ, చట్టంశెట్టి పుల్లయ్య, న్యాయవాదులు బాద జాన్ బాబు, మళ్ళ గంగాధర్, మూది నారాయణస్వామి ఉన్నారు.

రామోజీరావు మృతికి 'పలివెల' సంతాపం

విశాలాంధ్ర - సీతానగరం : రామోజీరావు మృతికి సంతాపం తెలిపిన పలివెల వీరబాబు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు సంతాపాన్ని తెలిపారు. అలాగే భారత దేశంలో మీడియాలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహా వ్యక్తి అని కొనియాడారు. రామోజీరావు గారు మీడియాను శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్లిన మహనీయుడని అని అన్నారు. అలాంటి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని కోరుకోవడంతో పాటు చెరుకూరి రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల్లో గుండెలో మీడియా ద్వారా చెరగని ముద్ర వేసిన వ్యక్తి అని కొనియాడారు.

ఏడో రోజుకు చేరిన జీడిపిక్కల కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని సిరిపురం జాతీయ రహదారి ప్రక్కన గల జీడి పిక్కల ఫ్యాక్టరీలో కార్మికుల తొలగింపు నిరసిస్తూ నిర్వహిస్తున్న ఆందోళన శనివారానికి 7వ రోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా కార్మికులు గేటు వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత ఏడు రోజులుగా అనేక విధాలుగా ఆందోళనలు చేపట్టిన యాజమాన్యం కనీసం కార్మికులతో చర్చలకు కూడా రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. తక్షణమే యాజమాన్యం, అధికారులు స్పందించి కార్మిక చట్టాలను అనుసరించి చర్చలు చేపట్టి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్ రాజు, బి నాని, ఎన్ సుబ్బారావు, బి అప్పారావు, వై చిన్ని, వి సతీష్, ఏ కుమారి, ఏసురత్నం, ఎం ప్రియాంక, సూర్యావతి, గౌరీ, దుర్గ కార్మికులు తదితరులు ఉన్నారు.

రామోజీరావు మృతికి ఎమ్మార్పీఎస్ సంతాపం

విశాలాంధ్ర - మండపేట : ఈనాడు అధినేత రామోజీరావు మృతి పట్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ధూలి జయరాజు సంతాపం వ్యక్తం చేశారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని నడిపి సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని నడుపుతున్న తమకు మీడియా పరంగా సాయం చేశారన్నారు. నేటి వరకు తమ గొంతు తమ సమస్యలపై మీడియా రూపంలో ఎంతో సహకారం అందించారని పేర్కొన్నారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అకాల మరణం చెందడం పట్ల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంతాపం తెలియజేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న జ్యోతుల నెహ్రూ

విశాలాంధ్ర - గండేపల్లి : జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కుటుంబం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దర్శనం చేసుకున్నారు. శనివారం మధ్యాహ్న సమయంలో జ్యోతుల నెహ్రూ మణి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని తీర్థప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ నాకు ఇంతటి ఘనవిజయాన్ని అందించిన జగ్గంపేట నియోజకవర్గ ప్రజలందరూ ఆ స్వామి వారి కృపాకటాక్షాలతో ఎప్పుడు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ ఐదు సంవత్సరాల చంద్రబాబు పరిపాలనలో సంక్షేమ అభివృద్ధితో ప్రజలు కష్టాలు తీరతాయని అన్నారు. ఆయన వెంట తోట సర్వారాయుడు, జంపన సీతారామచంద్ర వర్మ, సింహాచలం రిటైర్డ్ పిఆర్ఓ తులా రామారావు, సుంకవిల్లి రాజు, పాతంశెట్టి బాబ్జి, బోదిరెడ్ల సుబ్బారావు, కంచి కృష్ణార్జున, సుమన్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ పదవికి ముసునూరు రాజీనామా

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం. (పిఏసిఎస్) త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి ముసునూరి వెంకటేశ్వరరావు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా లేఖను పిఎసిఎస్ సీఈవో జగతా ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో బాధ్యతలు చేపట్టినప్పుడు మూడు కోట్ల రూపాయలను ఆదాయం ఉండేదని, ప్రస్తుతం 11 కోట్ల 30 లక్షలకు ఆదాయం పెంచామన్నారు. సుమారు 1.50 కోట్ల బకాయిలు వసూలుకు కృషి చేశానన్నారు. ప్రభుత్వం నుండి గతం నుండి నేటి వరకు ధాన్యం కొనుగోలు కమీషన్ నిమిత్తం సంఘానికి సుమారు కోటి రూపాయలు రావాల్సి ఉందన్నారు. సంఘ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలం నందు డిసిసి బ్యాంక్ నూతన నిర్మాణ భవనం, షాపింగ్ కాంప్లెక్స్, వాటర్ ప్లాంట్ నిర్మాణం కొరకు డిసిసి బ్యాంక్ కాకినాడ వారికి సుమారు 60 లక్షలకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికలలో చర్ల జగ్గిరెడ్డి ఓటమికి నైతిక భాధ్యత వహిస్తూ తన త్రిసభ్య కమిటీ సంఘ చైర్ పర్సన్, పర్సన్ పదవులకు రాజీనామా చేస్తూ, ఆమోదించవలసినదిగా కోరారు.

యనమలను కలసిన ఆనందరావు

విశాలాంధ్ర - అమలాపురం : తెలుగుదేశం పార్టీ సీనియర్ జాతీయ నాయకుడు యనమల రామకృష్ణుడును అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. యనమలకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. చంద్రబాబునాయుడు, యనమల నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ఘనమైన విజయాలు సాధించాలని ఆనందరావు ఆకాంక్షించారు. ఆయన వెంట అల్లవరం మండల టీడిపి అధ్యక్షుడు దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబురాజు) వున్నారు.

నారా లోకేష్‌కి సత్తిబాబురాజు అభినందనలు

విశాలాంధ్ర - అల్లవరం : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను అల్లవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దెందుకూరి సత్యనారాయణ రాజు (సత్తిబాబురాజు) శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్‌కి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

గిడ్డి సత్యనారాయణకు ముస్లిం మైనార్టీ అభినందనలు

విశాలాంధ్ర - మండపేట : పి గన్నవరం నియోజకవర్గం నుంచి జనసేన కూటమి అభ్యర్థిగా ఎంపికైన గిడ్డి సత్యనారాయణను శనివారం రాష్ట్ర నూర్ బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సుభాన్ నాయకత్వంలో మండపేట ముస్లిం మైనారిటీలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి మెజార్టీతో గెలుపొందిన ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మౌలానా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూర్ భాషా, సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.